


## ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించాలి


# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 25 నవంబరు, 2024 | పేజీలు : 05


# సర్వే డేటా ఎంట్రీ కీలకమైనది

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

### డోర్‌లాక్, వలస వెళ్ళిన వారి వివరాలు ఫోన్ కాల్ ద్వారా సేకరించాలి

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఉపముఖ్యమంత్రి. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే, డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్, సుల్తానియా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశ్వర్లు తో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ రాజధాని నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సర్వే, డేటా ఎంట్రీ లో నాణ్యత చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తితే వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలిపి ఆ వివరాలను క్రమ బద్ధీకరించు కోవాలని, వారిని అందుబాటులో ఉండాలని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధరీకరించుకోవాలని తెలిపారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, ఆయా పాఠశాలలో ఆహారం, పరిశుభ్రత పై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు సంబంధిత జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్ర ణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఈ వీడి యో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శా రద మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన సమగ్ర కు టుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఎన్యుమారెటర్లు స్వయంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ల వద్ద ఉండి, స్వయంగా ఎంట్రీ చేయించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా చేయించాలని, ఏదైనా తేడా వచ్చినట్లు అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో స్టిక్కరింగ్ వేసి సర్వేకు వచ్చిన సమయంలో ఏదేని కారణాలచే ఇంటి సర్వేకు రాలేదు అని భావించిన వారు ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీని సంప్రదించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష లో సీపీఓ గోవింద రాజన్, జడ్పీ సీఈవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆహారం ముఖ్య భూమిక

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకునే ఆహారం ముఖ్య భూమిక పోషిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద అన్నారు. పిఎం ఫోషన్ అభియాన్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి అధ్వర్యంలో జిల్లా స్థాయిలో మధ్యాహ్న భోజన వంటవారి వంటల పోటీలు ఆదివారం గీసుగొండ మండలంలోని వంచనగిరి కస్తూర్భా గాంధీ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో పౌష్టిక ఆహారం అందించేందుకు వంటవారు సరైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంటచేసే వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు సరైన పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంచనగిరి కస్తూర్భా గాంధీ పాఠశాలలో వంటగదిని, వంట సరుకులను పరిశీలించి తగు సూచనలు చేశారు. జిల్లాలోని 13 మండలాల నుండి విచ్చేసిన వంట వారు వండిన వంటలను రుచి చూసి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసారు. రుచికరంగా వంట చేసిన వారిలో మొదటి బహుమతి ఖానాపూర్ మండలానికి చెందిన సుశీలకు, రెండవ బహుమతి గీసుగొండ మండలానికి చెందిన రేణుకకు, మూడవ బహుమతి నల్లబెల్లి మండలానికి చెందిన స్వప్నకు లభించింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించగా, ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, డిసిఈబి సెక్రటరీ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొనున్నారు. అ నంతరం. వంచనగిరి కస్తూర్భా బాలికల వసతి గృహాన్ని, సంగెంలో ని గిరిజన బాలుర వసతి గృహాన్ని, కస్తూర్భా బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లో ఫిర్యాదుల పెట్టెలోని ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాల ని సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశించారు.

## చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా
# 'ఉద్యమానికి ఊపిరి పోద్దాం'

### పోరాటం చేయకుంటే ఈ ప్రాంత అస్థిత్వాన్ని కోల్పోతాం..

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా ఉద్యమానికి ఊపిరిపోద్దాం అని ఉమ్మడి మద్దూరు ధూల్మిట్ట మండలాల రాజకీయ జెఏసి నాయకులు తాజా మాజీ జడ్పిటీసీ గిరి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గం అసెంబ్లీ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు స్వర్గం లక్ష్మయ్యలు అన్నారు. ఉమ్మడి చేర్యాల, కొమురవెల్లి, ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రాంతాల ప్రజలతో ఈ నెల 30న జెఏసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ జెఏసి ధూల్మిట్ట మండల కన్వీనర్ సుందరగిరి భాస్కర్ ఆధ్వర్యంలో జెఏసి నాయకులకు సంఘీభావంగా ధూల్మిట్ట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, కుల, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నాలుగు మండలాలకు జనగామ నియోజకవర్గం, హుస్నాబాద్ డివిజన్, సిద్దిపేట జిల్లా, యాదాద్రి భువనగిరి పార్లమెంట్ స్థానాలుగా ఇలా చేర్యాల, ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలాలు ముక్కలుగా విభజించి విసిరి వేసినట్లుగా నాలుగు మండలాలు అభివృద్ధిలో, మనుగడలో ఈ ప్రాంతం ప్రశ్నార్థకంగా మారిందని, వెనుకబాటు తనానికి గురౌతోందని నాయకులు పేర్కోన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే అది రెవెన్యూ డివిజన్ తోనే సాధ్యం అని నాయకులు పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంతవరకు జేఏసీకి మద్దతుగా ధూల్మిట్ట మండలంలోని పార్టీలకు అతీతంగా మద్దతు తెలుపుతూ, పోరాటంలో ఉద్యమానికి ఊపిరి పోద్దాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల జెఏసి నాయకులు, యువజన, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగం ద్వారానే బానిస బతుకులకు విముక్తి

### రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** భారత రాజ్యాంగం ద్వారా బానిస బతుకులకు విముక్తి కలిగిందని అటువంటి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. టిజిఓ నేత జెల్ల సుధాకర్, దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) మెదక్ జిల్లా కమిటీల అధ్వర్యంలో మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో 75 ఏళ్ళ భారత రాజ్యాంగ ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య హజరై మాట్లాడుతూ, కుల వివక్ష, నేరాలకు భారత రాజ్యాంగం శిక్షలు వెస్తుందన్నారు. దేశానికి దక్షిణ భారత దేశంలో రెండవ రాజధాని వుండాలని ప్రతిపాదన బాబాసాహెబ్ ముందు చూపుకు నిదర్శనమన్నారు. బోధించు, సమికరించు పోరాడి బానిస సంకెళ్ళ నుండి విముక్తి పొందాలన్నారు. హైకోర్టు న్యాయవాది పొన్నం దేవరాజ్ గౌడ్, మాట్లాడుతు మను అధర్మ శాస్త్రం రాజ్యాంగంగా చెలమణి అయి బహుజనులను చదువుకు, ఉద్యోగాలకు, రాజకీయ అధికారం,సంపద లేకుండా చెసిందన్నారు. తొలి మనిషిని మనిషిగా చూడ నిరాకరించిందన్నారు. డాక్టర్ బిఅర్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం వల్ల విద్య,ఉద్యోగాలు, సంపదలు వచ్చాయాన్నారు. టిఎన్‌జిఒఒ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ భారతదేశంలో నేటికి కుల, మత వివక్షలు కొనసాగుతున్నాయన్నారు. నిద్రలో వున్న బిసిలు మెల్కోని రాజకీయ అధికారాన్ని సాధించుకొవాలన్నారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందన్నారు.డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మాట్లాడుతు, స్వేచ్ఛ, సమానత్వం సొదరభావం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయన్ని భారత రాజ్యంగం అందించిందన్నారు. కొట్లాది మంది అణగారిన వర్గాల జివితాల్లో వెలుగులు నింపిన 75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాన్ని పండుగుల నిర్వహించాలన్నారు. రాజ్యాంగ దినొత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బి.అర్.అంబెద్కర్ కాంస్య విగ్రహ కమిటి అధ్యక్షులు గంగాధర్, బహుజన నాయకులు రాచకొండ వెంకన్న, గౌడ సంఘం



నాయకులు బాల్ రాజ్ గౌడ్, తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, గిరిజన గురుకుల విద్యాలయం ఉపాధ్యాయయరాలు అర్చన కులకర్ణ, డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజివ్,జిల్లా కార్యదర్శి దయాసాగర్, వివిధ సంఘాల నేతలు అహ్మద్, బ్యాగరి వేణు, గరుగుల శ్రీ నివాస్, న్యాయవాది సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు భారత రా జ్యాంగ నిర్మాత డా.బి.అర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. ఎస్టీ గురుకుల విద్యార్థినిలు సానియా, శ్రీ లత లు రాజ్యాంగ పిఠికను ప్రతిజ్ఞ చెయించారు. ఎస్‌సి గురుకుల విద్యార్థిని బార్గవి వార్తలు చదివారు. రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాస, క్విజ్ పొటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనానికి ఎకరం స్థలం కేటాయించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు జెల్ల సుధాకర్, గంగన్న, నరేందర్, బొందుగుల నాగరాజులు వినతి పత్రం సమర్పించారు. కళాకారుడు మధు అంబేద్కర్‌ను స్మరిస్తూ పాటలు పాడారు.

## లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. కాగా మూడో రోజు కార్యక్రమంలో భాగంగా వందలాది మంది భక్తుల సమక్షంలో లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు కళ్యాణం యొక్క విశిష్టతలను, అందులోని ఘట్టాలను పండితులు వివరించడం జరిగింది. లోక కళ్యాణం కోసం, సమాజ హితం కోసం స్వామి వారికి కళ్యాణ మహోత్సవాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవ తంతును తిలకించేందుకు వరంగల్ నుండే కాకుండా జఫర్‌గడ్ చుట్టుపక్కల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణం ముగిసిన అనంతరం స్వామి వారికి కానుకలను సమర్పించడం జరిగింది.

## జనగామ మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** జనగామ జిల్లా (ఏఎంసీ) నూతన మార్కెట్ కమిటి చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ఆదివారం మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీసోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అద్యక్షుడు సిద్ధిరాజు యాదవ్, యాదవ సంఘం నాయకులు సలేంద్ర సోమన్న, చిలువేరు కృష్ణమూర్తి, వర్రె వెంకన్న, కత్తుల బిక్షపతి, కత్తుల యాకయ్య, బైకాని ఐలేష్, బెల్లి యుగేందర్, పాండు కృష్ణ, మారబోయిన ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహా పడి పూజ



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం గురుస్వామి నాయిని వెంకటేశం స్వగృహంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని గురు స్వామి రంజిత్ గౌడ్, రెడ్డి శెట్టి రవీందర్, యాదగౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల దీక్షలో భాగంగా అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు కాకుండా గ్రామంలోని మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారన్నారు. అయ్యప్ప పడిపూజ కార్యక్రమం భక్తి భజన సంకీర్తనలతో గ్రామంలో ఆహ్లాద వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు రమణ పంతులు వెంకటేష్ గౌడ్, నవీన్ రెడ్డి, నవీన్ గౌడ్, రఘు, మధు, ధనంజయ, శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, వై.వెంకటేశం, వెంకటరెడ్డి, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, మావురం రాజు, నాయిని శ్రీనివాస్, ప్రసాద్,రవి తదితరులు పాల్గొన్నారు.

## సర్వే డాటా ఎంట్రీ కీలకం

### వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డాటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులోని లేని వారికి ఫోన్ కాల్‌చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్దీకరించుకోవాలని, వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావులేకుండా కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవడానికి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లా,మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో సర్వే వివరాలు పక్కాగా నమోదు అయ్యేలా తగు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వ స్కూల్‌లలో, హాస్టల్‌లలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా కృషి చేస్తున్నామన్నారు. వారికి పౌష్టికాహారం అందించేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

## కార్తీకమాసం సందర్భంగా.. కాళేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్త జనం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** కార్తీకమాసం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది.భక్తుల శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసంలో చివరి ఆదివారం సెలవు రోజు కావడంతో తెలంగాణతో పాటు మహారాష్ట్ర, చత్తీష్ గడ్ ప్రాంతాల నుండి ఉదయం నుండే వేలాదిగా తరలివచ్చిన భక్త జనం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రానికి భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు ముందుగా త్రివేణి సంగమ తీరం వద్ద గోదావరిలో కార్తీక స్నానాలు ఆచరించారు. ఇసుకతో సైకత లింగాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి,గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. త్రివేణి సంగమ తీర ప్రాంతంలో భక్తుల సందడిగా మారింది.అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ప్రత్యేక అభిషేక పూజలకు భక్తుల రద్దీ నెలకొనగా స్వామి వారి సర్వ దర్శనానికి వేలాది మంది భక్తుల తాకిడి పెరగడంతో క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు.ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు వద్ద 365, లక్ష వత్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలయ అర్చకులకు భక్తులు దీపదానాలు సమర్పించారు.

## కలెక్టర్ సారూ.. నాకు న్యాయం చేయండి





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న గోపరాజు సాంబలక్ష్మి భర్త పేరు శ్రీనివాస్ గత 30 సంవత్సరా లుగా పట్టణంలోని ఆర్అండ్‌బి మెయిన్ రోడ్డు లో గల ఊర పోచమ్మ గుడికి సేవలు చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. నాకు 2010 ఫిబ్రవరి 26న అప్పటి సర్పంచ్ గుర్ర సౌందర్య చంద్రయ్య నన్ను విచారించి నాకు పోచమ్మకు సేవలు అందించాలని ధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారు. అప్పటినుండి ఇప్పటివరకు నేను అమ్మవారికి సేవలు చేస్తూనే ఉన్నాను. ఈ క్రమంలో భక్తులు గుడి వద్ద వారికి నచ్చిన విధంగా వేసే కానుకలతో నా జీవనం కొనసాగిస్తూ వచ్చాను. కుటుంబాన్ని పోషించుకున్నాను. వేరే పని లేకపోవడంతో ఈ గుడిని నమ్ముకుని నా జీవనాన్ని గడుపుతున్నాను. అయితే నాలుగు నెలల క్రితం భూపాలపల్లికి చెందిన ఓ వ్యక్తి ముగ్గురుని వెంట వేసుకొని వచ్చి నాపై నిర్దాక్షిణ్యంగా దాడి చేశారు. ఇదేంటి అని అడిగితే ఈ గుడి మాకు కావాలంటూ గద్దించారు. పైగా నాటకీయ రాజకీయ పరిణామాలతో నన్ను పూర్తిగా అక్కడి నుంచి గెంటివేశారు. దీంతో నేను నా కుటుంబం రోడ్డున పడింది. రోజు అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో సేవలు చేసే నేను ఒక్కసారిగా గుడి దూరం కావడంతో మానసిక క్షోభకు గురై మంచానపడ్డాను. నా ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. కాగా నాకు అన్యాయం చేసిన వారిపై చర్యలు తీసుకొని నేను సేవలు చేసే ఊరపోసమా గుడిని తిరిగి నాకు అప్పచెప్పేలా చేయగలరని జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులు దేవాదాయ శాఖ అధికారులకు నాకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మంగపేటః** ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట కేంద్రంలో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ధనసరి రాజేష్ మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఏజెన్సీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని మంగపేట మండలంలో ఆదివాసీ గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదివాసీ చట్టాలను కాపాడాలని వారన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మంగపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. మండల అధ్యక్షులుగా కుర్సం శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా సున్నం నరసింహారావు, ఉపాధ్యక్షులు పర్శిక రామరావు, కార్యదర్శి పర్శిక రమాదేవి, కోశాధికారిగా కుర్సం సాయిలను ఎన్నుకున్నారు. 5వ షెడ్యూల్డ్ భూభాగంలో 1/70 చట్టాన్ని అమలు చేయడానికి పూర్తిగా ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ హక్కులు చట్టాలను కాపాడుకొనుటకై కొమురం భీం ఆశయాలతో ఉద్యమించాలని ఆదివాసులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు తాటి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆగబోయిన ప్రశాంత్, ములుగు జిల్లా ఏవిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బోదెబోయిన సురేష్, వాజేడు మండల ఉపాధ్యక్షులు పూనేం రాధాకృష్ణ, వెంకటాపురం మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, ఏటూరునాగారం మండల అధ్యక్షులు పాయం భారతి, వెంకట పున్నయ్య, కురుసం వెంకటేశ్వర్లు, బాడిశ నరసింహారావు, పంద శ్రీను, కంతి అశోక్, నాగమణి, రామలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాలలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్, జిల్లా ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారంలో పరీక్షకు 202 విద్యార్థులు నమోదు చేసుకోగా 194 మంది విద్యార్థులు హాజరైనట్లు 08 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లిలో 232 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 217 మంది విద్యార్థులు హాజరైనట్లు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలియజేశారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు 5 సంవత్సరములు 12 వేల రూపాయల చొప్పున ఉపకార వేతనము కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతుందని వారు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో వైద్య సౌకర్యం మరియు 144 సెక్షన్ విధించారు. పోలీసుల పర్యవేక్షణలో శాంతిభద్రతలను పరీక్ష కేంద్రంలో వద్ద కల్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారం కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తపరిచారు. వీరి వెంట జిల్లా ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్ రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్ లు ఎన్.లక్ష్మీ ప్రసన్న, జె.ఉమారాణి డిపార్ట్మెంటల్ అధికారులు ఎం.పురుషోత్తం రెడ్డి, ఎండి.అఫ్రోజ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్ తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాల అమలు తోనే బిజెపి గెలుపు

**ప్రజాపక్షం/టేక్మాల్:** మహారాష్ట్రలో మూడవసారి భారతీయ జనతా పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు మాట్లాడుతూ, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న వివిధ వినూత్నమైన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా మహారాష్ట్ర ప్రజలు బీజేపీకి మరో మారు పట్టం కట్టారని తెలిపారు. మహారాష్ట్రలో బీజేపీని ఓడించేందుకు ఇండియా కూటమి చేసిన ప్రయత్నాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరవేయ డం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, మండల ఉపాధ్యక్షులు వడ్డె రాములు, టౌన్ అధ్యక్షులు దొడ్ల నాగరాజు గిరిజన మోర్చా అధ్యక్షులు సేనాపతి, భూత్ అధ్యక్షులు భాష అనిల్, మంగలి వెంకట్, గొల్ల రమేష్ సాధు రమేష్, శ్రీరామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/కొహెడః** కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కొహెడ మండల కేంద్రంలోని బిజెపి నాయకులు కలిశారు.ఈ సందర్భంగా బిజెపి కొహెడ మండల అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం మాట్లాడుతూ కొహెడ మండలంలోని 27 గ్రామాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులకు ఈజిఎస్ గ్రాంట్ నుండి స్పెషల్ నిధులు మంజూరు ఇప్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కోరారని, దానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గంగాడి క్రిష్ణరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, హుస్నాబాద్ పట్టణ బిజెపి అధ్యక్షుడు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా బిజెవైఎం మాజీ ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఖిలా వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు జిల్లా కమిటీ ఆద్వర్యంలో ఆదివారం జరిగాయి.ఈ కార్యక్రమంలో 60 రేషన్ డీలర్లు పాల్గొన్నారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా మంద భారతి రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా మంద శ్రీవాణి మహేందర్ ఏగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు దరావత్ మోహన్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్, ఉమేందర్, గడ్డం బాబు, మండలాధ్యక్షుడు, ఖిలా వరంగల్ మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్ కమలాపూర్ ఆడపడుచే



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ తోటి చైర్మన్ గా నియమింపబడిన తవుటం ఝాన్సీ రాణి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తవుటం రవీందర్ సతీమణి అన్న విషయం తెలిసిందే. మార్కెట్ చైర్మన్ గా పదవీ స్వీకారం చేయబోతున్న తవుటం ఝాన్సీ రాణి స్వగ్రామం కూడా కమలాపూర్ కావడం విశేషం. మండల కేంద్రానికి చెందిన శ్రీరామ్ దత్తాత్రేయ ధనలక్ష్మి దంపతుల ప్రథమ పుత్రికే ఝాన్సీ రాణి. నిత్యం వారి ఇంటిలో పార్టీ కార్యకలాపాలు, కార్యకర్తల సమావేశాలు సంభాషణలతో రాజకీయంగా ఆమె కూడా కొంత అవగాహన ఏర్పడే అవకాశం ఉంది. మార్కెట్ చైర్ పర్సన్ గా దక్కిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మార్కెట్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, రైతుల సమస్యలే ప్రధానంగా పనిచేస్తూ మార్కెట్ ను ముందుకు తీసుకెళ్తానని చెప్పారు.

## మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని పెరికెడ్ గ్రామానికి చెందిన దురిశెట్టి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆదివారం బాధిత కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఉగ మునిత, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్ర ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు తీగల సాయిలు, బండి కుమార్, ఎడ్ల పెళ్లి నరేందర్ రావు, దురిశెట్టి రమేష్, షాపురం సాయిలు, ఎండి రఫీ దురిశెట్టి రజినీకాంత్, ఎండి రహీం సల్ల కొమురయ్య, పాల పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కోత లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** రైతులకు మద్దతు ధర , సన్నధాన్యానికి బోనస్ అందించడం కోసం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొందరు స్వలాభం కోసం పంపించిన ధాన్యంలో కటింగ్స్ చేపట్టి రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని బిజెపి ములుగు జిల్లా నాయకులు భూక్యా జవహర్లాల్ అన్నారు. ఆదివారం వెంకటాపూర్ మండలం నల్లగుంట లోని ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించారు రైతులతో మాట్లాడారు మండలంలోని నర్సాపూర్ కి వెళ్ళిన ధాన్యానికి కింటాకి 6 కిలోల చొప్పున కటింగ్ విధించారని రైతులు వాపోయినట్లు ఆయన పేర్కొన్నారు. మిల్లర్ల నుండి ఎలాంటి కోతలు ఉండయని అవసరమైతే గోదాములకు ధాన్యం తరలిస్తామని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం కోసం పలు నియమాలు తీసుకోవచ్చామని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ అమలులో మాత్రం నిర్లక్ష్యం చెబుతుందని ఆయన పేర్కొన్నారు ఇప్పటికైనా రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి మిల్లర్ల ఆగడాలను అరికట్టాలని లేకపోతే బిజెపిఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో భూక్యా రాజ్ నాయక్,నునవత సక్రు నాయక్, బల్ల , లక్ష్మణ్, శరత్, శ్రీధర్, కృపాన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి కుటుంబ సర్వే శిక్షణ



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** హసన్ పర్తి మండలం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో జే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ఆర్థిక ,విద్య, కుల,సామాజిక సర్వేలోస్వీకరించిన వివరాలను తప్పులు లేకుండా పకడ్బందీగా డాటా ఎంట్రీ చేయాలని సూపర్వైజర్లకు, ఎలిమినేటర్లకు, ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినారు. గడువులోగా తమకు ఇచ్చిన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి అందించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కర్ణాకర్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవోవిజయలక్ష్మి, సూపర్వైజర్లు, న్యూమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడల తో శారీరక మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** విద్యార్థులు నిరంతరం క్రీడలలో పాల్గొనడం ద్వారా వారిలో శారీరక వికాసం తో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తద్వారా జీవితం లో ఉన్నత శిఖరాలను చేరుకోగలుగు తారని జిల్లా విద్యాశాఖాధికారి ప్రో డి.రాధాకిషన్ రావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల లో నిర్వహిస్తున్న 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బాలుర సాఫ్ట్ బాల్ చాంపియన్షిప్ పోటీలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసి ప్రసంగించారు. నర్సాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, మాసాయిపేట లో సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అని మునుముందు కూడా ఇలాంటి క్రీడలకు మాసాయిపేట వేదిక కావాలని, దానికి కావలసిన సౌకర్యాలను కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గత రెండు రోజులుగా గా జరుగుతున్న ఈ పోటీలలో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ, మెదక్ జిల్లా జట్టు ద్వితీయ, మంచిర్యాల జిల్లా జట్టు తృతీయ స్థానం లో నిలిచి బంగారు, వెండి, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం లో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అభిషేక్ గౌడ్, ప్రధాన కార్య దర్శి శోభన్ బాబు, కోశాధికారి రేణుక, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రమేష్, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మ పూరీ, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు రంగా రెడ్డి, కార్యదర్శి శ్రీ హరి రంజన్ శర్మ, మెదక్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి శ్యాం సుందర్ శర్మ, వివిధ జిల్లా ల నుండి విచ్చేసిన క్రీడాకారులు, కోచ్ లు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్ మహాధర్నా విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/వాజేడు:** వాజేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఛలో హైదరాబాద్ చేయూత పెన్షన్‌దారుల మహాధర్నా విజయవంతం చేయాలని ఆదివారం వాజేడు ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షుడు చెన్నం స్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు పెన్షన్ రూ.4016 నుండి 6000 పెంచాలని ఇతర చేయూత పెన్షన్ రూ.2016 నుండి రూ. 4వేలు పెంచలేదని, కండరాల క్షీణత వారికి పెన్షన్ రూ.4016 నుండి రూ.15వేల పెన్షన్ పెంపుదల సాధనకై ఈ నెల నవంబర్ 26న ఛలో హైదరాబాద్ చేయూత దారుల మహాధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందకృష్ణ మాదిగ ఎంఆర్‌పిఎస్, విహెచ్‌పిఎస్, ఎంఎస్‌పి, వ్యవస్థాపకులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వస్తున్న సందర్భంగా వాజేడు మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుండి ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, మండల ఎంఆర్‌పిఎస్ సంఘ సభ్యులందరూ అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల ఉపాధ్యక్షులు లేగల రవి, అధికార ప్రతినిధి బలుసుపాటి స్వామి, ఎంఎస్‌పి వాజేడు మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పవని భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు హెచ్చరించారు. భూపాలపల్లి డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 65 మంది నీ కోర్టు ముందు హాజరు పరచడం జరిగిందని ఆదివారం డిఎస్పి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు మద్యం సేవించి పట్టుపడితే మోతాదును బట్టి జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారని అన్నారు. శనివారం డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ ద్వారా మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులను 65 మందిని జిల్లా మేజిస్ట్రేట్ ముందు ప్రవేశ పెట్టగా 9 మందికి 2 రోజుల జైలు శిక్ష విధించి 56 మందికి జరిమానా విధించడం జరిగిందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతారని, దీంతో మీ కుటుంబం బజారు పాలవుతుందని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు మేలు కలుగుతుంది



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు మేలు కలుగుతుందని వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ అన్నారు . ఆదివారం నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేశారు . ఈ సందర్బంగా వ్యవసాయా మార్కెట్ కమిటి చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసే వరి ధాన్యం కోనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోని వరి పంటకు మద్దతు ధర పొందాలని సూచించారు . ఎ గ్రేడ్ రకం ధాన్యానికి 2320 రూపాయలు ,సి గ్రేడ్ దాన్యంనకు 2300 రూపాయలు ప్రభత్వం ధర నిర్ణయించి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందని తెలిపారు . కాంగ్రేస్ ప్రభుత్వం వరి ధాన్యంనుకు మద్దతు ధరతో పాటు అర్హులైన రైతులకు బోనస్ చెల్లించడం హర్షించ దగ విషయమన్నారు . ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సునిత ,మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి ,ఇస్తారి శేఖర్ ,జెట్టి రాంమూర్తి ,శోభన్ ,వైనాల అశోక్ ,దండెం రవింధర్ ,మాజీ ఉప సర్పంచు రమేష్ తదితరులు పాల్గోన్నారు .

## రాష్ట్రస్థాయికి ఎంపికై త్రినేష్ అభినందించిన ఎస్సై



**ప్రజాపక్షం/నర్సంపేట :** రాష్ట్ర స్థాయి అండర్ 14 విభాగానికి ఎంపికైన ఖోఖో క్రీడాకారుడిని నర్సంపేట ఎస్సై గూడ అరుణ్ ,ఎంఈవో సారయ్యలు అభినందించారు. వరంగల్ లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో జరిగిన అక్టోబర్ 20న జరిగిన 68వ ఎస్‌జిఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ఖో ఖో అండర్ 14 ఇయర్స్ బాలుర విభాగంలో జడ్పీఎస్ఎస్ బాయ్స్ నర్సంపేట పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న శీలం త్రినేష్ తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలు హైదరాబాద్ జిల్లాలో నవంబర్ 24 నుండి 26 వరకు జరుగనున్నాయని, రాష్ట్ర స్థాయికి వెళ్లే విద్యార్థికి అయ్యే ప్రయాణ ఖర్చులు రిటైర్డ్ తెలుగు పండిట్ టీచర్ కృష్ణారావు అందించడం జరుగుతుందని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి కోట రాంబాబు ఉపాధ్యాయు లు రమేష్, శ్రీనివాస్. అబిద తబస్సుమ్, రమేష్, రమేష్, ఉమా మహేశ్వర్, రవికుమార్, గోపాల్ రావు, బిక్షపతి, బుచ్చిరాములు, బాల, శైలజ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన భూక్య విగ్నేశ్వర్ చిన్నారికి ప్లేట్ లెట్స్ పడిపోయాయి. వీరు చాలా బీదవారు వారి వద్ద డబ్బులు లేక చాలా ఇబ్బందులు పడుతూ దాతల సహాయం కోరగా జ్వాలా చారిటబుల్ ట్రస్టుల వారి వాట్సాప్ గ్రూప్‌లో వీరి పరిస్థితి గురించి వివరించగా గ్రూప్‌లో కొంత మంది దాతలు సుమారుగా రూ.10వేలు ఇది వరకే పంపించగా అలాగే వరంగల్‌కు చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ కీలక సభ్యులు ప్రభుత్వ ఉపాధ్యాయులు గజ్జెజల సుమన్ సేవ్ ద చిల్డ్రన్ ఫౌండేషన్ వారి తరుపున రూ.6200 ఆదివారం జ్వాలా చారిటబుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భూక్యా విగ్నేశ్వర్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోడెల నరేష్, ఉపాధ్యక్షులు కస్ప ముకుందం, కోశాధికారి కొండపర్తి నగేస్, బండపల్లి రవి, సయ్యద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/కొడిపల్లి:** మండలం సోలవత్పూర్ పంచాయతీ పరిధిలో కొత్తపల్లి గ్రామములోని స్థానిక హనుమాన్ మందిరములో కార్తీక మాసం సందర్భంగా ఇస్లావత్ రవీందర్ నాయక్ దంపతుల ఆధ్వర్యంలో సామూహిక సత్య నారాయణ వ్రతము, ప్రత్యేక పూజలు అన్న దాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లా డుతూ, కొత్తపల్లి సలావత్పూర్ గ్రామస్తులు తాం డవాసులు ఆ భగవంతుని దయ వల్ల ఆరోగ్యాలతో బాగుండాలని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాండవాసులు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు.

## 90 శాతం పూర్తి అయిన కులగణన సర్వే

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 9 నుండి ప్రారంభించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన, సర్వే వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో 90 పూర్తయినట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 19 వేల కుటుంబాలు 17,500 గృహాలు ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం మాకు ఉన్నాయని, ఆదివారం సైతం సర్వే బృందాలు సర్వే నిర్వహించి సోమవారం లేదా మంగళవారం వరకు 100 సర్వే పూర్తి చేస్తారని ఆశ భవాని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ దయాకర్, సీనియర్ అసిస్టెంట్ ఐలయ్య, జూనియర్ అసిస్టెంట్ అనురాధ, టైపిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సాక్షిగా నిర్లక్ష్యానికి నిదర్శనం

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం పక్కన అమర్చిన వీధిలైట్ల బోర్డుకు ఎలాంటి పైకప్పు లేకపోవడంతో కరెంటు వైర్లు బయటకు వచ్చియి.ఆదమరిచి ఎవరైనా తగిలితే ప్రాణాలు హరి అనేలా ఉన్నాయి. ఇంత నిర్లక్ష్యానికి సచివాలయ సిబ్బందే కారణం సచివాలయ అధికారులు అన్ని చూసుకోలేని పరిస్థితిలో సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయేలా, ప్రమాదం పొంచి ఉంది .నిర్లక్ష్యానికి నిదర్శనం అంబేద్కర్ సాక్షి అనడానికి ఎలాంటి సందేహం లేదేమో.

## కారుప్రమాదంలో మహిళకు గాయాలు

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని సోడశపల్లి గ్రామానికి చెందిన నీలం గోనమ్మ 22.11.2024 వతేదిన సోడశపల్లి గ్రామంలో మధ్యాహ్నం సమయంలో రోడ్డు మీదుగా ఇంటిదగ్గర నడుచుకుంటూ వెల్తుండగా హనుమకొండలోని గోకుల్‌నగర్‌కు చెందిన సట్ల ఫణిందర్ కారు నెంబరు టిఎస్ 03 ఇ ఎక్స్ 3499 గల కారులో సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా కారు నడుపడం వలన మానానమ్మ నీలం గోనమ్మకు ప్రమాదవశాత్తు ఢీ కొనడం వలన తలకు బలమైన గాయాలు కావడమేకాకుండా ప్రక్కనే ఉన్న గోడకూడా కూలిందని గోనమ్మ మనుమడు నీలం రాకేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఎసై అజ్మీర సురేష్ తెలిపారు .

## భక్తులతో కిటకిటలాడిన ఏడుపాయల వనదుర్గమ్మ క్షేత్రం



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని క్షేత్రంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయం, ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, బండరాళ్లు, గలగల పారే గంగమ్మ పరవళ్ళు, ప్రకృతి ఒడిలో సేదతీరుతు న్నామనిపించే వాతావరణం, జనమే జయుని సర్పయాగ స్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో భక్తులు వివిధ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన అనంతరం భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యాం, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి, వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అమ్మ దర్శనానికి సమయం పట్టింది. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్ళ మధ్య బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. చల్లంగా చూడమ్మా..వనదుర్గమ్మ తల్లి అంటూ భక్తులు వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లోని షెడ్లు, చెట్ల కింద భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుపయనమయ్యారు.

## ఏబిసిడి వర్గీకరణను అడ్డుకుంటున్న ఎమ్మెల్యేలను సస్పెండ్ చెయ్యాలి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** ఏబిసిడి వర్గీకరణను అడ్డుకుంటున్న ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ ఎందుకు సస్పెండ్ చేయడం లేదని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను నరసయ్య లు విమర్శించారు. ఆదివారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఏబిసిడి వర్గీకరణ పై సుప్రీంకోర్టులో ఆగస్టు 1న తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తెలంగాణ రాష్ట్రంలో ఏబిసిడి వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొంతమంది ఏబిసిడి వర్గీకరణను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా ఏబిసిడి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని చేపడుతూ మాల మాదిగల మధ్య చిచ్చులు పెడుతున్నారు. స్వయంగా అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు దాన్ని అడ్డుకోవాలని చూస్తున్నప్పటికీ మరి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వారిని హెచ్చరించకుండా సస్పెండ్ చేయకుండా ఉండడం అనేది విడ్డూరంగా ఉందని వారన్నారు. అధిష్టానం తీసుకున్నటువంటి నిర్ణయాన్ని కాదని ఏబిసిడి వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని కనీసం కూడా హెచ్చరించకపోవడం ఆందోళనగా ఉందన్నారు. ఏది ఏమైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకునే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉండాలని రాష్ట్రంలో ఉన్నటువంటి మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని వారు కోరారు. కాదని మాలలు చేసే ఒత్తిడిలో మాదిగలకు అన్యాయం చేస్తే భవిష్యత్తులో మాదిగల చేతిలో చేతిలో వచ్చే స్థానిక ఎన్నికలతో పాటు అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నష్టపోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో మాస్ రాష్ట్ర నాయకులు జన్ను రాములు, టీఎంఆర్పీఎస్ నాయకులు మరుపట్ల అంజయ్య, మాస్ నాయకులు మారపల్లి ఎల్లయ్య, చంద్రమౌళి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి మామిండ్ల చంద్రయ్య, తూల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



**ప్రజాపక్షం/మల్హర్:** గ్రామీణ వైద్యులు ఐక్యంగా ముందుకెళ్తూ హక్కులు సాధించుకోవాలని తెలంగాణ ఆర్ఎంపీ,పిఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ ఆలయ ఆవరణలో మండల అధ్యక్షుడు కుక్కడపు అశోక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా కార్తీక మాసంలో భాగంగా నాగులమ్మ అమ్మవారికి దీపారాధన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియమ, నిబంధనల పాటించాలని,పరిమితినికి మించిన వైద్యం చేయొద్దని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ప్రభుత్వం గ్రామీణలకు వ్యతిరేకంగా లేదన్నారు.పారా మెడికల్ శిక్షణ తరగతులు పున:ప్రారంభం కోసం ఆయా నియోజకవర్గాల్లో, మండలాల్లో ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయాలన్నారు. గ్రామీణ వైద్యులు ఐక్యంగా ముందుకు వెళుతు హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాసి బాలరాజు, అధికారప్రతినిధి చెవురి రాజేందర్,ఉపాధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, సంయుక్త కార్యదర్శి ముదుతనపల్లి ప్రభాకర్, ఈసీ మెంబర్ లింగన్నపేట శ్రీనాత్, మాజీ జిల్లా కార్యదర్శి భూమయ్య,మండల కోశాధికారి చొప్పరి రాజయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ కార్యదర్శి రమేష్,సీనియర్ వైదులు వొన్న తిరుపతి రావు, శ్రీదర్, లక్ష్మీ రాజాం, చెంద్రమొగిలి లు పాల్గొన్నారు.

## కార్తీకమాస వన భోజనాలకు హాజరైన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** పద్మశాలి, గౌడ కులస్థుల కార్తీక మాస వన భోజనాలల కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంటె స్టెడ్ కార్పోరేటర్ బెడర వీరన్న, 37వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయిని దూడయ్య యాదవ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు ఏసీరెడ్డి ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శంకరబోయిన చందర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కలకోట్ల కుమార్, ఓబీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు శిరబోయిన గిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శిరబోయిన కిరణ్, దేవర రాజు, కమ్మగోని దేవా, పత్తిపాక అరుణ్, గద్దం రాజు, శ్రీకాంత్, రంగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ విద్యాలయంలో చదివిన 2006,07 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ లో శాంతినికేతన్ విద్యాలయం 2006 2007 బ్యాచ్ కి సంబంధించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపాఠశాల డైరెక్టర్లు జగన్మోహన్ రెడ్డి, మధుకర్ సంపత్ రెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యాయులు బండి తిరుపతి కుమార్, ప్రసాద్, ఉపాధ్యాయురాలు సుజాత,జుబేదా అనంతలక్ష్మి పూర్వం విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు.

## జనసభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** డిసెంబర్ 6న వరంగల్‌లో జరిగే జనసభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి సాంబయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి హిందుత్వ ఎజెండాను అమలుచేయడంలో ఉన్న శ్రద్ధ పెరుగుతున్న ధరలను, నిరుద్యోగాన్ని, ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశ సంపదను అదాని, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు అభివృద్ధి పేరుతో దోచిపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జీడి సోమయ్య, కళింగరాజు, బాబు, సారయ్య, రాజు, ఉప్పలయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో గౌడల ఆరాధ్య దైవం సర్వాయి పాపన్న విగ్రహాన్ని వైయస్సార్ సెంటర్లో ఈనెల 28న శాసన సభ్యులు పొంది మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని గౌడ సంఘ నేతలు ఆదివారం తెలిపారు. ఆహ్వాన పత్రాలను మండల కేంద్రంలోని పిఎసిఎస్ చైర్మన్ మారం రాముకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే మండల కేంద్రంలోని ప్రజాప్రతినిధులు, అని రాజకీయ పక్ష నేతలకు అన్ని కుల సంఘ నేతలకు నేరుగా వెళ్లి ఇంటింటికీ ఆహ్వాన పత్రాలు అందించారు. ఉదయం విగ్రహావిష్కరణ అనంతరం అన్నదాన కార్యక్రమం అయ్యప్ప స్వాములకు ప్రత్యేక బిక్ష కార్యక్రమాలు ఉంటాయని, విగ్రహ కమిటీ నిర్వాహకులు గిరగాని శ్రీనివాస్ గౌడ్, పలుసంపూర్ణ చందర్ గౌడ్, కారింగుల సురేష్ గౌడ్, తాళ్లపల్లి చెన్నకేశవులు గౌడ్, కక్కర్ల నాగయ్య గౌడ్, గద్దం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం పిలుపుమేరకు కార్తీక మాస వన ఉత్సవ భోజనాలు ఆదివారం నిర్వహించడం జరిగింది. వరంగల్ లోని పోచమ్మ మైదానం దగ్గర పోచమ్మ తల్లి కార్తీక మహోత్సవ వన భోజనాలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జి డబ్ల్యుఎంసి మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బసవరాజు కుమార్, మరిపెళ్లి రాజన్న, పైడి రాజేశ్వర్ ,చక్రి ,లింగాల జనార్ధన్, పైడిపాల రమేష్ భాస్కర్, సారంగపాణి, రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వ స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** టిడిపి సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండల కేంద్రంలో టీడీపీ పార్టీ సభ్యత్వాలను మండల పార్టీ అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద భీమా వర్తి స్తున్నట్లు తెలిపారు. వచ్చే రోజులలో రాష్ట్రంలో టీడీపీ పార్టీకి పునర్‌వైభవం తీసుకురావడం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రమేష్, పార్టీ కార్యకర్తలు, తదిత రులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష



**ప్రజాపక్షం/చిట్యాల:** మండలంలో పోలీసుల విధి నిర్వహణలో భాగంగా నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు లలో శనివారం 11 మందిని భూపాలపల్లి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఇద్దరు వ్యక్తు లకు రెండు రోజులజైలు శిక్ష తోపాటు ఫైన్ విధించడం జరిగింది. తొమ్మిది మందికి ఫైన్ విధించారని స్థానిక ఎస్ఐ గన్నమనేని శ్రావణ్ కుమార్ తెలిపారు.ఎస్సై మాట్లాడుతూ, మండ లంలోని గ్రామాలలో ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు విధించ డం జరుగుతుందని, వాహనదారులు మద్యం సేవించి వాహనలు నడపరాదని, మద్యం సేవించి పట్టుబడితే జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చ రించారు.నంబర్ ప్లేట్లు లేని వాహనాలు కని పిస్తే సీజ్ చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్య లు తీసుకుంటామని సూచించారు.రోడ్డు ప్ర మాదాలు నివారించడానికి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని వాహనదారులను కోరారు.

## ఉద్యమకారుల సమితి నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణం లో తెలంగాణ ఉద్యమకారుల కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నిక చేసినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి దార్ల రమాదేవి, బైరి తిరుపతిరెడ్డి, మాజీ మం డల పార్టీ అధ్యక్షుడు మచ్చిక నర్సయ్యలు తెలి పారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితి పట్టణ అధ్యక్షులుగాఅప్పాల సుదర్శన్, ఉపా ధ్యక్షులుగా మునిగాల సాయి కృష్ణా రెడ్డి, దం డిగ రమేష్, దొంగల సురేష్, ప్రధాన కార్యద ర్శిగా మంచోజు కళ్యాణ రాముడు, కార్యదర్శు లుగా వేల్పుల సురేష్, ఆకారపు చందర్, గాన్ లోజు భాస్కర్ దోనాల రవి, కోశాధికారి పెం డ్యాల యాదగిరి, ప్రచార కార్యదర్శిగా మేడిద శ్రీనివాస్,దుగ్గిరాజు,ముఖ్య సలహాదారులు ఇసపెల్లి కట్టయ్య, దార్ల చంద్రమ్మ, నాడెం ఇందిరమ్మ, కొమ్ము వీరస్వామి, గౌరవ అధ్య క్షులుగా బోళ్ల స్వామి, పల్నాటి సాంబయ్య, రూపిక నరసయ్య, కార్యవర్గ సభ్యులుగా మిట్ట పల్లి అంజయ్య, యూత్ అధ్యక్షులుగా శ్రీని వాస్, కుమారస్వామిలను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.

## పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు 2728 తేదీలలో కరీంనగర్ నుండి వేములవాడ పాద యాత్ర పోస్టర్ ను శనివారం నెక్కొండ మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్ వద్ద జిల్లా అధ్యక్షులు నందగిరి రజినీకాంత్, ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రజనీకాంత్ మాట్లాడుతూ 27, 28 తేదీల్లో జరిగే పాదయాత్రకు తెలంగాణ మలిదశ ఉద్యమ కారులందరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు కొత్త సంపత్ రెడ్డి మాట్లాడుతూ, జార్కండ్ తరహాలో ఉద్యమకా రులకు 25 వేల రూపాయల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలాన్ని, ఎలక్షన్ల ముందు గౌరవ ముఖ్య మంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవే ర్చాలని, ప్రతి ఒక్క ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండదం డగా ఉండాలని కోరారు. కార్యక్ర మంలో ఉద్యమకారు లు కవులు కళాకారుల రాష్ట్ర కొక న్వీనర్ శ్రీనివాస్, జిల్లా మీడియా అధికార ప్రతినిధి నర్మెట యాదగిరి, జిల్లా కార్యదర్శి అల్లి యాదగిరి,జిల్లా కార్యదర్శి కత్తుల సదానందం, జిల్లా కార్యదర్శి భాగ్య లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు శాడా సరితా రెడ్డి, నర్సం పేట డివిజన్ అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది బొడ్డుపల్లి అజయ్ కుమార్, నెక్కొండ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు శాడా అనిత రెడ్డి, ఉపాధ్య క్షురాలు అల్లి ఉమాదేవి, రమ్యసుధ, శోభ, విజయ, ఉపా ధ్యక్షులు యకయ్య, మెండ నర్సయ్య, కోరుకొండ యకయ్య, కోమల్ రెడ్డి, నర్సింహ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తా




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ అభివృద్ధికి తోడ్పాటునం దిస్తానని పూర్వ విద్యార్థినుల సమ్మేళన సన్నా హక సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఈవీ శ్రీనివాస్ రావు అన్నారు.1980 విద్యా సంవత్సరంలో ఏర్పాటు చేయబడి ప్రస్తుత 2024 విద్యాసం వత్సరంనాటికి 44ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మే ళనం కార్యక్రమాన్ని జనవరి 4న కళాశాల ప్రాంగ ణంలో ఘనంగా నిర్వహించతలపెట్టినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ ప్రసాద్ ప్రకటించారు. ఈమే రకు కార్యక్రమ నిర్వహణ సన్నాహక సమావేశాన్ని పూర్వ విద్యార్థినుల సంఘం ప్రతినిధులు అనితాజ యంతి, శెట్టిపల్లి సౌమ్య, రమాదేవి, నిహారిక తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించుకున్నారు. ఈ కార్య క్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమం డలి సభ్యులు, పూర్వ విద్యార్థుల సంఘం నేత ఈవీ శ్రీని వాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమగ్ర అభివృద్ధికి తన వంతు తోడ్పాటునందిస్తానని వెల్లడించారు. ఈ సంధ ర్భంగా విద్యార్థినులు ఈవీ శ్రీనివాస్ రావు కు తమ సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందిం చారు. అనంతరం మర్యాదపూర్వకంగా వారిని సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పాలిటెక్నిక్ విద్యా ర్థుల జెఏసి రాష్ట్ర ఛైర్మన్ మేకల అక్షయ్ కుమార్, కళా శాల శ్రేయోభిలాషులు రిటైర్డ్ ఉద్యోగులు డాక్టర్ వెంకట నారాయణ, మహేందర్, ప్రస్తుత భోదనా భోదనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియుటిఎస్ గౌరవ అధ్యక్షులుగా ఆకులపల్లి దుర్గయ్య నియామకం



**ప్రజాపక్షం/టేక్మాల్ :** పిఆర్‌టియుటిఎస్ మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఆకులపల్లి దుర్గయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పిఆర్ టియుటిఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ప్రకటించారు. ఈ నియామకంపై మండల శాఖ పక్షాన హృదయపూర్వక ధన్యవా దాలు తెలియజేశారు. ఆకులపల్లి దుర్గయ్య 1985లో స్పెషల్ టీచర్‌గా ప్రాథమిక పాఠశాల కుసంగి వద్ద విధుల్లో చేరి, అప్పటి నుంచే పిఆర్‌టియు టిఎస్ లోనే సభ్యత్వాన్ని కొనసాగించారు. అనేక పదవుల్లో పని చేస్తూ, సంఘ అభివృద్ధికి విశేష కృషి చేశారు. మెదక్ సమితిలో స్పెషల్ టీచర్ ప్రతినిధిగా తొలి బాధ్యతలు చేప ట్టారు. మండల ఉపాధ్యక్షునిగా మూడుసార్లు, ప్రధాన కార్యదర్శిగా నాలుగుసార్లు, మండల అధ్యక్షు నిగా ఆరుసార్లు విజయవంతంగా ఎన్నికై సేవ లందించారు. ఉమ్మడి మెదక్ జిల్లా కార్యద ర్శిగా, ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా పనిచేశారు. మండల పి ఆర్ టి యు టి ఎస్ కార్యాలయం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించడం ఆయన కృషికి నిలువుటద్దంగా నిలిచింది. ప్రతి ఉపాధ్యాయ సమస్య పరిష్కారానికి ముందుండి పోరాడుతూ, తన సమయాన్ని, శక్తిని సంఘ అభివృద్ధికి అంకితం చేశారు. ఆయనను మెదక్ జిల్లా గౌరవ అధ్య క్షుడిగా నియమించినందుకు మండల శాఖ హర్షం వ్యక్తం చేస్తూ, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, మరియు రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** ఢిల్లీలోని పార్ల మెంట్ భవనానికి అంబేద్కర్ పార్లమెంట్ గా నామకరణం చేయాలని అదేవిదంగా కరెన్సీ పై, జాతీయ జెండా పై అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని దళిత నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కుమా రస్వామి మాట్లాడుతూ పార్లమెంట్ భవనానికి అంబే ద్కర్ పార్లమెంట్ గా నామకరణం చేయాలని, కరెన్సీ, జాతీయ జెండా పై అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిదంగా డిసెంబర్ 5 న దళిత నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వ హించడం జరుగుతుందన్నారు. ఈ నెల చివర నుండి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఉన్నందున ఆ సమావేశాల్లోనే చర్చించి బిల్లు ప్రవేశపెట్టి కేబినెట్ ఆమోదం తెల పాలని అన్నారు.పార్లమెంట్ ముందు 205 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద తమ నిరసన తెలపడం జరుగుతుందని అందులో భాగంగానే ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుం దని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ బీసీ బిడ్డ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గిరిజన బిడ్డ, ఇద్దరు అంబేద్కర్ వారసులైన కూడా అత్యున్నత స్థానంలో ఉండి అంబే ద్కర్ ను విస్మరించడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తుంద న్నారు.భారత రాజ్యాంగాన్ని రచించిన ప్రపంచ మేధావి అయిన అంబేద్కర్ ను గౌరవించడం అందరి బాధ్యత అని అన్నారు.ఈ సమావేశంలో కంజర్ల సమ్మయ్య, తది తరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మద్యం సేవించి వాహ నాలు నడిపితే చర్యలు తప్పవనీ ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు.జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదే శాల మేరకు ఆదివారం సాయంత్రం ఏడుపాయల కమాన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వ హించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 11మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ, వాహ నదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాల న్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం భక్తుల భద్రత దృష్ట్యా ఏడుపాయల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు బస్వరాజు, వెంకటేష్, హోంగార్డు మల్లేశం, తదితరులున్నారు.

## ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం



**ప్రజాపక్షం/ నర్సంపేట:** ఎన్‌సిసి లో పాల్గొనడం వల్ల వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యత, దేశభక్తి పెంపొందుతుం దని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ గారు అన్నారు. ఎన్‌సిసి లో పాల్గొనడం వల్ల రక్షణ శాఖలో ఉద్యో గాలు సాధించవచ్చునని, ఉన్నత విద్యా రంగంలో రిజర్వేషన్లకు అవకాశం కూడా ఉందన్నారు. దీనితో పాటు సామాజిక బాధ్యత పెంపొందుతుందని పేర్కొన్నారు. లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్లో ఎన్‌సిసి డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉపన్యాస , చిత్రలేఖన పోటీలు నిర్వహించారు, దేశ భక్తి గేయాలు పాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి థర్డ్ ఆఫీసర్ ఎండి రియాజుద్దీన్, భవానీ చంద్, ప్రదీప్, వినోద్, శ్రీకాంత్, రాజేష్, రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట కోర్టులో ఈ సేవా కేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/నర్సంపేట:** వరంగల్ జిల్లా నర్సంపేట కోర్టులో ఆది వారం ఈ సేవాకేంద్రం ప్రారంభోత్సవాన్ని సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పి.నరసింహ రావు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే వీడియో లింకేజ్ ద్వారా ప్రారంభించారు. ఈసేవా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్ర మానికి వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి విబి నిర్మలా గీతాంబ, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్, న్యాయమూర్తి కె.చండీశ్వరీ దేవి, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుట్టపాక రవి, కార్యదర్శి సిలువేరు కిరణ్ కుమార్, ఏజిపిలు సంజయ్ కుమార్, శివ, న్యాయవాదులు కొమ్ము రమేష్ యాదవ్, మోటురి రవి, నారగోని రమేష్, ఠాకూర్ సునీత, బొట్ల పవన్, నాగుల రమేష్, అశోక్, వీరేష్, స్రవంతి తది తర న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలోని మహిళా కారాగారాన్ని న్యాయమూర్తులు సందర్శించి, అక్కడి మహిళా ఖైదీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఆరోగ్య, వ్యక్తిగత పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకు న్నారు. ఉచిత న్యాయ సలహాలు సూచనల కొరకు న్యాయ సేవాధి కార సంస్థలను ఆశ్రయించాలన్నారు.